పత్రికాప్రకటన                                                                                    కాకినాడ, జూన్ 18, 2018.

**ప్రజావాణిలో ప్రజా సమస్యల వెల్లువ.**

**ఎలక్ట్రీషియన్ గంపల చినగోవిందుకు తక్షణ వైద్యం.**

**అనుమతి లేని లేఅవుట్లపైన కఠిన చర్యలు.**

కాకినాడ కలక్టరేట్‌లో సోమవారం నాడు జిల్లా కలక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి మీ కోసం కార్యక్రమంకు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రాకు, జాయింట్ కలక్టర్ ఎ.మల్లిఖార్జునకు విన్నవించారు. **ఈ ప్రజావాణి కార్యక్రమములో సుమారు 318 మంది అర్జీదారులు హాజరై తమ అర్జీలను కలక్టర్‌కు, జాయింట్ కలక్టర్‌కు అందజేశారు.** వీటిలో భాగంగా తమ భూములు ఆక్రమణలకు గురి అయ్యాయని, ఉపాధి అవకాశాలు కల్పించాలని, పింఛన్లు, నివేసన స్థలాలు మంజూరు చేయాలని కూడా కలక్టరుకు విన్నవించారు. ఈ ప్రజావాణిలో పలు కుటుంబ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు కలక్టరు దృష్టికి తెచ్చారు. భూమి వివాదాలు, స్థల వివాదాలు విషయాలు కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేసారు. ఈ సమస్యల పై కలక్టరు స్పందిస్తూ సంబంధిత అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం పై తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అల్లవరం మండలం తూర్పులంకలో పిల్లి భీమా రావు అర్జీదారుడు గతంలో 3 సార్లు ప్రజావాణిలో విన్నవించినప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదని తెలుపగా, దీని పై అమలాపురం ఆర్‌డిఓను స్వయంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు.

**గంపల చినగోవిందుకు వైద్య సహాయం :** కె.గంగవరం మండలం దంగేరు గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ గంపల చినగోవిందుకు గత సంవత్సరం జనవరి నెలలో విద్యుత్‌ఘాతం చేత శరీరమంతా కాలిపోయిందని, ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రాజానగరం జియస్‌ఎల్ ఆసుపత్రిలో కొంత వరకూ వైద్యం అందించారని, తదిపరి పూర్తి స్థాయి వైద్యం అందిస్తేగాని పని చేయలేని పరిస్థితిలో ఉన్నానని కలక్టర్‌కు వీజ్ఞప్తి చేయగా, దీని పై కలక్టర్ స్పందిస్తూ అతనికి వెంటనే ప్లాస్టిక్ సర్జరీ ద్వారా వైద్యం అందించాలని డిఎంహెచ్‌ఓకు , ఎన్‌టిఆర్ వైద్య సేవా కోఆర్డినేటర్‌కు ఆదేశించారు. డిఎంహెచ్‌ఓ ఈ నెల 21 గురువారంనాడు జిజిహెచ్ ప్లాస్టిక్ సర్జరీ ఓపిలో తదుపరి వైద్య సేవలు నిమిత్తం చూపించుకోవల్సిందిగా గంపల చినగోవింద్‌కు సూచించారు.

**అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు :** జిల్లాలో అక్రమ లేఅవుట్లను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా డిపిఓను ఆదేశించారు. సామర్లకోట మండలం పనసపాడు శివారు గొంచాలతూర్పు దొడ్డికి చెందిన రైతులు తమ గ్రామంలో సర్వే నెం. 15/2లో అక్రమ లేఅవుట్లు వేస్తున్నారని కలక్టర్‌కు చేసిన ఫిర్యాదు పై కలక్టర్ స్పందిస్తూ అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**కుక్కల బెడద నుండి కాపాడండి:** కాకినాడ నగరంలో పారిశుధ్య పనులు మెరుగుపర్చి కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని **36వ డివిజన్ కార్పొరేటర్ ఎస్.లక్ష్మి ప్రసన్న** కలక్టర్‌ను కోరారు. ఇటీవల కాకినాడ నగరంలో 6 సంవత్సరాల బాలుడు పై వీధికుక్కలు దాడి చేయడం మూలంగా మరణించాడని ఈ కుక్కలను అదుపు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆమె కలక్టర్‌ను కోరారు. రంగంపేట మండలం మర్రిపూడికి చెందిన రైతు మోర్త వెంకన్న తన పొలంలో వ్యవసాయ పంపు సెట్టు వేసుకోవడానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని కలక్టర్‌ను కోరారు. దీనీ పై తగు చర్యలు తీసుకోవాలని కలక్టర్ ఎస్‌సి కార్పొరేషన్ ఇడిని ఆదేశించారు. పిఠాపురం మండలం మంగితుర్తి గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి తాతయ్య తన భార్య 2018 మే 9 తేదీన మరిణించిందని బ్యాంక్ ఖాతాలో కొంత సొమ్ము ఉందని ఆమె నామినేషన్ ఎవరి పేరున ఇవ్వనందున ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ కొరకు తహశిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేయగా, విఆర్ఓ, ఆర్ఐ రెండు వేలు లంచం అడుగుతున్నారని కలక్టర్‌కు తెలుపగా, కాకినాడ ఆర్‌డిఓను విచారణ జరిపి సంబంధిత విఆర్ఓపై తగు చర్యలు చేపట్టాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు.

**సీతానగరం మండలం సీతానగరానికి చెందిన శీలం అరవాలు** రజక కులానికి చెందిన వాడినని, తనకు ఏ విధమైన ఆస్తులు లేవని, ప్రభుత్వం ఇస్తున్న హౌసింగ్ పథకంలో ఇల్లు మంజూరు చేయాలని జేసిని కోరగా, రాజమహేంద్రవరం సబ్ కలక్టర్‌ను పరిశీలించి, ఇంటి స్థలం మంజూరు చేయాలని జేసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. భద్రాచలం కొత్తగూడెంకు చెందిన విశాకకోటి వాసుదేవ రమణారావు తన యొక్క భూమిని తన తండ్రి వద్ద నుండి సెటిల్‌మెంట్ భూమి వారసత్వ సంపదగా సంక్రమించి, తన స్వాధీనంలో ఉందని, సర్వే నెం. 68/2ఆన్‌లైన్‌లో కుచ్చర్లపాటి నిర్మాలా దేవి పేరున మారిందని, విచారణ జరిపి తన పేరును మార్చాలని జేసికి దరఖాస్తు సమర్పించగా, ఎటపాక తహశిల్దార్‌ను విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని జేసి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు .

( సమాచార శాఖ చే జారీ )